7

సాక్షి
ఖమ్మం

గురువారం । 12 । జనవరి । 2023

పెద్దాస్పత్రిలో ఉద్రిక్తత.. సూపరింటెండెంట్‌పై మృతురాలి బంధువుల దాడి 8లో

సభకు సన్నాహకం

- బీఆర్‌ఎస్ సభ ఏర్పాట్లపై మంత్రులు, ఎమ్మెల్యేల దృష్టి
- నియోజకవర్గాల వారీగా సమావేశాలు
- ఉమ్మడి జిల్లాలో 'గులాబీ' సందడి షురూ
- నియోజకవర్గాల వారీగా ఒకరి నుంచి ఇద్దరికి బాధ్యతలు



సభాప్రాంగణంలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్, ఎంపీ నామ తదితరులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: బీఆర్‌ఎస్ తొలి సభకు ఖమ్మం గుమ్మంలో సందడి మొదలైంది. మంత్రులతోపాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర బుధవారం నూతన కలెక్టరేట్‌ను పరిశీలించడంతోపాటు సభా ప్రాంగణాన్ని కూడా పరిశీలించి అధికార యంత్రాంగానికి సూచనలు చేశారు. అలాగే, నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు మొదలయ్యాయి.

ప్రాంగణాన్ని పరిశీలించిన మంత్రులు

మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ నూతన కలెక్టరేట్ సమీపంలోని సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. కలెక్టరేట్‌ను ప్రారంభించిన అనంతరం సీఎంలు ఎక్కడి నుంచి సభా వేదిక వద్దకు రావాలి, ప్రధాన వేదిక ఏర్పాటు, ప్రజలకు సీటింగ్ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఐజీ చంద్రశేఖరరెడ్డి, డీఐజీ రంగనాథ్, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్‌కు కలెక్టరేట్ ప్రారంభోత్సవం, సభ ఏర్పాట్లపై సూచనలు చేశారు. వీఐపీలు, సభకు తరలి వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా, ట్రాఫిక్ సమస్యలు రాకుండా చూసుకోవాలని చెప్పారు. ఇక సుమారు ఐదుగంటల పాటు నలుగురు సీఎంలు కలెక్టరేట్, సభా ప్రాంగణంలో ఉండనుండటంతో బందోబస్తు ఏర్పాట్లలో పోలీసులు నిమగ్నమయ్యారు.

జన సమీకరణపై నజర్

బహిరంగ సభకు ఐదు లక్షల వరకు జనం తరలివస్తారన్న బీఆర్‌ఎస్ నేతల ప్రకటనతో ఆ దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే 2.50 లక్షల నుంచి 3లక్షల మంది, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల నుంచి మిగిలిన జన సమీకరణకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆయా జిల్లాల్లో 24 మందితో కమిటీలు నియమించగా నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఖమ్మంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మధిరలో మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ నామ నాగేశ్వరరావు, వైరాలో ఎమ్మెల్యే క్రాంతికిరణ్, ముదిగొండ, బోనకల్, చింతకాని సమావేశాల్లో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఇల్లెందు సమావేశంలో టీఎస్ఎంఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పాల్గొన్నారు. అలాగే, కల్లూరు, పెనుబల్లి, తల్లాడలో సత్తుపల్లి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పాల్గొని జన సమీకరణపై దిశానిర్దేశం చేశారు.

ఇక్కడే మకాం..

బహిరంగ సభను సక్సెస్ చేసేందుకు నియమించిన 24 మంది సభ ముగిసే వరకు ఇక్కడే మకాం వేయనున్నారు. మండలాల వారీగా ఈనెల 16 లోపు సన్నాహక సమావేశాలు పూర్తిచేయాలని అధిష్టానం ఆదేశించడంపై ప్రత్యేక దృష్టి సారించారు.

ముహూర్తం నేడే..



- భద్రాద్రి కలెక్టరేట్‌ను ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- అనంతరం బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయం కూడా..
- కలెక్టరేట్ ప్రాంగణంలో పబ్లిక్ మీటింగ్

-వివరాలు 10లో

క్లుప్తంగా

భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారుల సమీక్ష



సభాస్థలి వివరాలను ఉన్నతాధికారులకు వెల్లడిస్తున్న సీపీ వారియర్

ఖమ్మంక్రైం/ రఘునాథపాలెం: నూతన కలెక్టరేట్ వద్ద ఈ నెల 18న బీఆర్ఎస్ బహిరంగ సభ జరగనున్న నేపథ్యాన భద్రతా ఏర్పాట్లపై పోలీసు ఉన్నతాధికారులు సమీక్షించారు. ఈ సభకు తెలంగాణ సహా నాలుగు రాష్ట్రాల సీఎంలు, భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరుకానున్నాయి. దీంతో ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, డీఐజీ రంగనాథ్ బుధవారం ఖమ్మం వచ్చారు. అతిథి గృహంలో ఏర్పాటుచేసిన సమీక్షలో సీపీ విష్ణు ఎస్.వారియర్ రూట్ మ్యాప్, భద్రత ఏర్పాట్లను వివరించారు. అలాగే, గతంలో ఖమ్మంలో విధులు నిర్వర్తించిన ప్రస్తుత మల్టీజోన్-2 ఐజీ షానవాజ్ ఖాసీం, వరంగల్ సీపీ రంగనాథ్, సీఎం సెక్యూరిటీవింగ్ డీఐజీ కూడా ఖమ్మం చేరుకున్నారు. అనంతరం పోలీసు ఉన్నతాధికారులు కలెక్టరేట్ సమీపాన సభాస్థలిని పరిశీలించి ఏర్పాట్లపై ఆరా తీశారు. నూతన కలెక్టరేట్, బహిరంగ సభావేదిక, పార్కింగ్, హెలీప్యాడ్‌ను పరిశీలించి జిల్లా అధికారులకు సూచనలు చేశారు.

బందోబస్తుకు 150 మంది పోలీసులు



ఖమ్మంక్రైం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గురువారం సీఎం కేసీఆర్ పర్యటన దృష్ట్యా జిల్లా నుంచి 150 మంది పోలీసులను బందోబస్తుకు కేటాయించారు. వారిలో ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలలతోపాటు ఇతర సిబ్బంది ఉండగా, బుధవారం రాత్రే కొత్తగూడెం చేరుకున్నారు. కాగా, కొత్తగూడెంలో నూతన కలెక్టరేట్‌ను సీఎం గురువారం ప్రారంభించనున్నారు.

కేసులపై అసిస్టెంట్ కలెక్టర్ సమీక్ష

ఖమ్మంలీగల్: స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్, సెకండ్ క్లాస్ కోర్టు పరిధిలోని కేసులను అసిస్టెంట్ కలెక్టర్ రాధికా గుప్త బుధవారం పరిశీలించారు. కోర్టు ఆదేశాల మేరకు ఇక నుంచి ప్రతీ బుధవారం ఈ ప్రక్రియ కొనసాగనుంది.

విధుల నుండి సబ్ రిజిస్ట్రార్ తొలగింపు

వైరా: వైరా సబ్ రిజిస్ట్రార్ రాంకుమార్‌ను విధుల నుంచి తొలగించారు. అనుమతి లేని వెంచర్‌లో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన విషయం బయటపడడంతో విచారణ జరిపించిన జిల్లా అధికారులు విధుల నుంచి తొలగిస్తూ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా వచ్చిన ఆయనకు మెమో జారీ చేసి పాత స్థానానికే పంపించారు. కాగా, వైరా ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా సీనియర్ అసిస్టెంట్ కరుణకు బాధ్యతలు అప్పగించారు.

రోడ్డుప్రమాదంలో రైతు మృతి

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కామేపల్లి మండలం సాతానిగూడెం గ్రామానికి చెందిన రైతు దుద్దుకూరి రాంబాబు (45) అదే మండలం పూసల తండాకు చెందిన మరో రైతు నరేశ్‌తో కలిసి ద్విచక్రవాహనంపై ఖమ్మం వచ్చి పురుగుమందులు కొనుగోలు చేశారు. తిరిగి వెళ్తుండగా వెనుకనుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రాంబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ఇక బైక్ నడుపుతున్న నరేశ్‌కు తీవ్ర గాయాలు కాగా ఖమ్మం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.


ఫర్నీచర్ దుకాణంలో అగ్నిప్రమాదం



షాపులో నుంచి వస్తున్న పొగ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 4వ డివిజన్ ఖానాపురం సెంటర్‌లోని ఫర్నీచర్ తయారీ, అమ్మకాల దుకాణంలో గ్యాస్ సిలిండర్ పేలడంతో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బుధవారం జరిగిన ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షల మేర నష్టం జరిగినట్లు అంచనా. దుకాణంలో పనిచేసే కార్మికులు వంట చేస్తున్న క్రమంలో మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. అగ్నిమాపక శాఖ ఉద్యోగులు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురాగా, నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,881

కోటలా కలెక్టరేట్

- రాష్ట్రంలోనే తొలిసారిగా కొత్తగూడెంలో గుట్టపై నిర్మాణం
- కార్యాలయానికి ప్రత్యేక ఆకర్షణగా గార్డెన్లు
- పాత రాతి కట్టడాల పద్ధతుల్లో నిర్మాణం
- కలెక్టరేట్ ఆర్కిటెక్ట్ ఉషారెడ్డి వెల్లడి





ప్రారంభానికి సిద్ధమైన నూతన కలెక్టరేట్ (ఇన్‌సెట్) ఆర్కిటెక్ట్ ఉషారెడ్డి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ ఏర్పాటైన తర్వాత అన్ని జిల్లాల్లో నూతన కలెక్టరేట్ భవనాల నిర్మాణం జరుగుతోంది. అందులో అన్నింటి కంటే భిన్నమైనదిగా భద్రాద్రి జిల్లా కలెక్టరేట్ నిలుస్తుందని అచ్చ తెలంగాణ బిడ్డ, ప్రముఖ ఆర్కిటెక్ట్ ఉషారెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ సూచనలతో నూతన కలెక్టరేట్ భవనాలకు ఆమె డిజైన్లు ఇచ్చారు. నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా మన పాలనా భవనానికి సంబంధించిన విశేషాలను ఆమె 'సాక్షి'కి తెలిపారు. అవి ఆమె మాటల్లోనే.. కొత్తగూడెం – పాల్వంచ మధ్యన ఎత్తయిన కొండపై జాతీయ రహదారి పక్కన స్థలాన్ని కలెక్టరేట్ కోసం ఎంపిక చేశారు. ఈ స్థలంలో ముందు భాగం కంటే వెనుక భాగం పది అడుగుల ఎత్తులో ఉంది. దీంతో ఇతర జిల్లాలకు ఇచ్చిన జీ ప్లస్ టూ డిజైన్ ఇక్కడ నప్పదని.. మా టీమ్‌తో కలిసి కొత్త స్కెచ్‌లు రెడీ చేశాం. సీఎం కేసీఆర్ ఇచ్చిన సూచనలు పాటిస్తూనే ఒకే భవనంలో జీ ప్లస్ టూ, జీ ప్లస్ వన్‌ను కలిపేసి డిజైన్ సిద్ధం చేశాం. ఈ కలెక్టరేట్‌లో ముందు సగం జీ ప్లస్ టూగా ఉంటే వెనుక సగ భాగం జీ ప్లస్ వన్‌గా ఉంది. కలెక్టరేట్ భవనం మధ్యలో స్టెప్డ్ గార్డెన్‌ను డిజైన్ చేశాం. నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ గార్డెన్ ఓపెన్ ఆడిటోరియంలా కనిపిస్తూ కలెక్టరేట్‌కు కొత్త అందాన్ని తీసుకొచ్చింది. అదే విధంగా హైవే ఎంట్రన్స్ నుంచి ప్రధాన భవనం ప్రవేశం వరకు దాదాపు రెండు అంతస్తుల అంత ఎత్తయిన ప్రదేశం ఉంది. సుమారు రెండు ఎకరాల్లో విస్తరించిన ఈ ప్రదేశంలో అందమైన గార్డెన్ వచ్చేలా ప్లాన్ చేశాం. నిర్మాణం పూర్తయిన తర్వాత ఈ కలెక్టరేట్‌ను చూస్తే హైవే పక్కన గుట్ట, గుట్ట మీద భవనం, మధ్యలో అందమైన గార్డెన్‌తో ఓ రాజకోటను తలపించేలా ఉంది. అంచనాలకు మించిన ఆకర్షణ ఈ భవనం సొంతం. ప్రస్తుతం కొత్తగూడేనికి వాడిన డిజైన్‌ను ములుగు జిల్లా కలెక్టరేట్‌కూ ఉపయోగిస్తున్నాం.

వాస్తు పాటించాం..

రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించిన అన్ని కలెక్టరేట్లలో వాస్తు పాటించాం. తూర్పు, ఉత్తర ముఖంగా వీటి నిర్మాణం జరిగింది. కొత్తగూడెం కలెక్టరేట్ ఉత్తర ముఖంగా ఉంటుంది, నైరుతి దిక్కున గ్రౌండ్ ఫ్లోర్‌లో కలెక్టర్ చాంబర్, దానిపైన సెకండ్ ఫ్లోర్‌లో మినిస్టర్ చాంబర్లు ఉన్నాయి. ఈశాన్యం వైపున ట్రెజరీ వస్తుంది. వీటితో పాటు సంక్షేమ శాఖలకు సంబంధించిన విభాగాలు ప్రజలు త్వరగా గుర్తించేలా డిజైన్‌లో మార్పులు చేశాం. కలెక్టరేట్ నిర్మించిన గుట్టపై నీళ్ల వచ్చే ఊట ఉంది. ఈ నీటిని మళ్లించి ఓ కొలను ఏర్పాటు చేశాం. ఇది సహజ సిద్ధమైన కొలనులా కనిపిస్తూనే ఇంకుడు గుంతలా కూడా పని చేస్తుంది.

పదిహేను ఏళ్లకు ఒకసారి..

భవనాలు కట్టిన కొత్తలో తళతళమంటాయి. కానీ నాలుగైదు ఏళ్లకే రంగులు వెలిసిపోయి కళా విహీనంగా కనిపిస్తాయి. ప్రజాధనంతో కట్టే ఈ కలెక్టరేట్ అలా కళ కోల్పోకూడదనే లక్ష్యంతో పాత రాతి కట్టడాల శైలిని అనుసరించాం. భవనం బయటి వైపు గోడలకు స్టోన్స్ వచ్చేలా డిజైన్ చేశాం. వీటికి రంగులు వేయాల్సిన పని ఉండదు. నీటితో కడిగినా, వర్షంలో తడిసినా మళ్లీ తనుకులీనుతాయి. ప్రజలు ఎక్కువగా వచ్చి పోయే ప్రదేశాల్లో టైల్స్‌కు బదులు గ్రానైట్ ఉపయోగించాం. సాధారణ భవనాలకు ఐదేళ్లకు ఓ సారి రంగులు, ఇతర మెయింటెనెన్స్ చేయాల్సి వస్తే ఈ కొత్త భవనాలకు పదిహేనేళ్ల వరకు ఆ అవసరం ఉండదు. 30 ఏళ్ల వరకు ఈ భవనం కొత్తదానిలాగే కనిపిస్తుంది. ఇక గాలి వెలుతురు బాగా వచ్చేలా పెద్ద కిటికీలు, వరండాలు, పెరడు (ఖాళీ స్థలం)లను డిజైన్‌లో భాగం చేశాం.

ఇంటి పండుగలా నిర్వహించుకుందాం..

- నగరాన్ని గులాబీమయం చేయాలి
- సన్నాహక సమావేశంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



మాట్లాడుతున్న మంత్రి అజయ్‌కుమార్, పక్కన ఎంపీ నామ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: టీఆర్ఎస్ బీఆర్ఎస్‌గా ఆవిర్భవించాక మొదటిసారి ఖమ్మంలో ఈ నెల 18న నిర్వహిస్తున్న సభను ఇంటి పండుగగా భావించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచించారు. బహిరంగ సభ విజయవంతానికి గాను ఖమ్మం వీడీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన సన్నాహక సమావేశానికి నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు హాజరుకాగా మంత్రి మాట్లాడారు. బీఆర్ఎస్ ఆవిర్భావ తొలిసభ ఖమ్మంలో జరగనుండగా.. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్ నుంచి జనసమీకరణ చేస్తున్నట్లు తెలిపారు. నూతన కలెక్టరేట్ ప్రారంభం అనంతరం 2.30 గంటలకు బహిరంగ సభ ప్రారంభమై 4.30 గంటలకు ముగుస్తుందని చెప్పారు. సభా ప్రాంగణంలో 70 వేల కుర్చీలు ఏర్పాటు చేస్తుండగా, సభా ప్రాంగణంతో పాటు నగరం, చుట్టుపక్కల గులాబీ తోరణాలతో అలంకరించాలని సూచించారు. నగరంలో డివిజన్‌ను, మండలంలో గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని జనసమీకరణ చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

బీఆర్ఎస్‌కు 18న సంక్రాంతి..

తెలంగాణ ప్రజలకు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు 15న పండుగ కాదని, ఈనెల 18నే సంక్రాంతి పండుగ అని ఎంపీ నామ నాగేశ్వరరావు అన్నారు. రాబోయే తరతరాలు చెప్పుకునేలా ఖమ్మంలో బీఆర్ఎస్ ఆవిర్భావ సభ విజయవంతానికి కృషి చేయాలని సూచించారు. జన సమీకరణ బాధ్యత నాయకులంతా చేపట్టాలని తెలిపారు. సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు ఆర్‌జేసీ కృష్ణ, బానోత్ చంద్రావతి, వీరూనాయక్, కర్నాటి కృష్ణ, కమర్తపు మురళి, లక్ష్మీప్రసన్న, ఫాతిమాజోహరా తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రిలో ఉద్రిక్తత

- వైద్యుడి నిర్లక్ష్యంపై మృతురాలి బంధువుల ఆందోళన
- ఆగ్రహంతో సూపరింటెండెంట్‌పై దాడి



దాడిలో సూపరింటెండెంట్ చొక్కా చిరిగిన దృశ్యం



ఆస్పత్రి వద్ద ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందిన మహిళ బంధువులు బుధవారం కూడా ఆందోళన కొనసాగించారు. ముక్కుకు శస్త్ర చికిత్స కోసం ఆస్పత్రిలో చేరిన పుట్టకోటకు చెందిన వెంకటలక్ష్మి మంగళవారం మృతి చెందగా, సాయంత్రం వరకు బంధువులు ఆందోళన చేపట్టారు. వైద్యుడిని సస్పెండ్ చేయడంతో పాటు కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఐసీయూ అద్దాలు, ఆవరణలోని పూలకుండీలను ధ్వంసం చేసిన విషయం విదితమే. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ బీ.వెంకటేశ్వర్లు చర్చలు జరిపి ఒకరికి ఔట్ సోరింగ్ ఉద్యోగం ఇస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కానీ, బుధవారం ఉదయం మరోమారు ఆందోళనకు దిగటంతో ఉద్రిక్తత నెలకొంది. ఈక్రమంలో వెంకటలక్ష్మి మృతదేహాన్ని మార్చురీలో భద్రపర్చగా పోలీసులకు ఫిర్యాదు అందకపోవటంతో పోస్టుమార్టం చేయాలా, వద్దా అని ఆస్పత్రి అధికారులు నిర్ధారణకు రాలేదు. ఇంతలోనే మార్చురీ వద్దకు మృతురాలి భర్త, బంధువులు పెద్దసంఖ్యలోచేరుకుని న్యాయం చేయాలంటూ ఆస్పత్రి తలుపులు మూసేసి ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో ఉన్నతాధికారులు వచ్చారని తెలుసుకున్న సూపరింటెండెంట్ కలెక్టరేట్‌కు వెళ్తూ గేట్లు వేసి ఉండడంతో తిరిగి కార్యాలయానికి బయలుదేరగా ఒక్కసారిగా ఆయనపై దాడికి దిగారు. పిడిగుద్దులతో దాడి చేయడమే కాక ఆయన చొక్కా చించేశారు. చివరకు పోలీసులు ఆయనను విడిపించి కార్యాలయానికి తీసుకెళ్తుండగా ఏసీపీ ఆంజనేయులుని కూడా తోసివేయటంతో ఆయన కిందపడ్డారు. పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారటంతో నాలుగు పోలీసుస్టేషన్ల నుంచి సిబ్బందిని పిలిపించి పరిస్థితులు చక్కదిద్దారు. చివరకు మృతురాలి బంధువులు, పలువురు నాయకులు సూపరింటెండెట్ వెంకటేశ్వర్లు చాంబర్‌లో చర్చలు జరిపారు. కుటుంబంలో ఒకరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం, ముగ్గురు పిల్లల భవిష్యత్ కోసం రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేయగా ఎటూ తేలకపోవడంతో సూపరింటెండెంట్, ఆర్ఎంఓ బీ.శ్రీనివాసరావు, బాధిత కుటుంబీకులు కలెక్టర్ గౌతమ్ వద్దకు వెళ్లగా చివరకు రూ.5 లక్షల పరిహారం, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఔట్‌సోరింగ్ ఉద్యోగం ఇచ్చేందుకు అంగీకరించడంతో ఆందోళన విరమించారు. కాగా టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మృతురాలి బంధువులు ఫిర్యాదు చేయటంతో మృతదేహానికి పోస్టుమార్టం చేశారు. కాగా, సూపరింటెండెంట్‌పై జరిగిన దాడిని ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్ అఫ్జల్‌హసన్, టీజీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆళ్ల శ్రీనివాసరెడ్డి, కస్తాల సత్యనారాయణతోపాటు ఖాజామియా, ఆర్‌వీఎస్.సాగర్, నందగిరి శ్రీను, హకీం, వేణు, కోడి లింగయ్య తదితరులు వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు.

వ్యాపారి ఇంట్లో ఐటీ సోదాలు

అశ్వాపురం: మండల కేంద్రంలోని ఓ ప్రముఖ వ్యాపారవేత్త నివాసంలో ఐటీ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. ఉదయం 11 గంటల సమయంలో వ్యాపారి నివాసానికి చేరుకున్న ఐటీ అధికారులు గేట్‌కు తాళం వేసి ఇంట్లోంచి ఎవరూ బయటకు వెళ్లకుండా, లోపలికి ఎవరూ రాకుండా చర్యలు తీసుకున్నారు. సుమారు మూడు గంటలపాటు సోదాలు నిర్వహించారు. వ్యాపారవేత్త కుటుంబ సభ్యులను విచారించి కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఆయనకు సంబంధించి మణుగూరులోని వ్యాపార సముదాయాల్లో కూడా తనిఖీలు చేపట్టారు. అశ్వాపురంలోని నివాసంతోపాటు మణుగూరు, కొత్తగూడెం, ఖమ్మం, హైదరాబాద్‌లోని వ్యా పార సముదాయాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలుస్తోంది. సోదా లకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బియ్యం పంపిణీ షురూ...

- సాయంత్రం నుంచి రేషన్ దుకాణాల ఎదుట క్యూ
- ఈ నెల 30 వరకు పంపిణీకి ఆదేశాలు



లబ్ధిదారు వేలిముద్ర నమోదు చేస్తున్న డీలర్



రేషన్ షాపులో నిల్వలు పరిశీలిస్తున్న డీఎస్ఓ రాజేందర్

ఖమ్మంసహకారనగర్: పేదలకు రేషన్‌షాపుల ద్వారా ఇచ్చే బియ్యం పంపిణీ ఎట్టకేలకు బుధవారం ప్రారంభమైంది. ప్రతి నెల 1 నుంచి 15వ తేదీ వరకు బియ్యం పంపిణీ చేస్తుండగా ఈసారి ఆలస్యమైంది. ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియకపోవడంతో సంక్రాంతి వేళ లబ్ధిదారులు ఆవేదన చెందారు. ఇంతలోనే బుధవారం నుంచి రేషన్ షాపుల్లో బియ్యం ఇస్తుండడంతో సాయంత్రం నుంచి షాపుల వద్ద క్యూ కట్టారు.

జిల్లాలో 11.41 లక్షల మంది

జిల్లాలోని 21 మండలాల్లో 748 రేషన్ షాపులు ఉండగా, 4,12,743 కార్డులకు గాను 11,41,601మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి 5 కిలోల చొప్పున ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఈనెల లబ్ధిదారులకు ఐదు కిలోలు ఇవ్వాలా, ఆరు కిలోలు ఇవ్వాలా అనే విషయంలో మీమాంస నెలకొనగా ప్రభుత్వం ఐదు కిలోలు ఇవ్వాలని సూచించింది. సాంకేతిక సమస్యగా చెబుతూ ఇన్నాళ్లు జాప్యం చేయగా, ఎట్టకేలకు బియ్యం పంపిణీ మొదలుకావడంతో లబ్ధిదారులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, బుధవారం నుంచి పంపిణీ ప్రారంభమైందనే సమాచారంతో సాయంత్రమే రేషన్ దుకాణాల ఎదుట లబ్ధిదారులు క్యూ కట్టారు. ఇక సాయంత్రం జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి బి.రాజేందర్ జిల్లా కేంద్రంలోని పలు దుకాణాలను తనిఖీ చేసి డీలర్లకు సూచనలు చేశారు.



స్టాండ్ వీల్ ఊడడంతో యంత్రాన్ని పట్టుకున్న దృశ్యం



స్టాండ్‌కు కొత్త వీల్ అమరుస్తున్న ఉద్యోగి



కంటిపరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఇప్పుడే ఇలా అయితే ?!

కంటివెలుగు రెండో విడత కార్యక్రమాన్ని ఖమ్మంలో ఈనెల 18న రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఇందుకోసం నూతన కలెక్టరేట్‌లో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు, శాఖ ఉన్నతాధికారులు రావడంతో ట్రయల్స్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈమేరకు ఆటో రిఫ్రాక్టర్లు, ఇతర పరికరాలు బిగిస్తుండగా స్టాండ్ వీల్స్ ఊడిపోయి కిందపడబోయాయి. దీంతో సిబ్బంది వాటిని పట్టుకుని కొత్త వీల్స్ బిగించారు. అనంతరం కొందరు సిబ్బందికి ట్రయల్‌గా కంటిపరీక్షలు నిర్వహించారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

మద్యం మత్తులో ఇంటికి నిప్పు

పేలిన సిలిండర్, చితకబాదిన గ్రామస్తులు




నాగయ్య

నేలకొండపల్లి: కుటుంబ కలహాలతో భార్యాపిల్లలు దూరం కావడం.. మద్యానికి బానిస అవడం.. వెరసి మానసిక స్థితి సరిగ్గా లేని వ్యక్తి మద్యం మత్తులో సొంత ఇంటికే నిప్పు పెట్టాడు. ఈ ఘటనలో గ్యాస్ సిలిండర్ పేలగా ఉలిక్కి పడిన గ్రామస్తులు ఆయనను చితకబాదారు. మండలంలోని చెన్నారానికి చెందిన బొడ్డు నాగయ్యతో గొడవ పడిన భార్య పుట్టింటికి వెళ్లింది. తోడుగా ఉన్న తల్లిని సైతం గాయపరిచి ఆమెనూ ఇంటి నుంచి పంపించాడు. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటూ మద్యానికి బానిసైన నాగయ్య మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. బుధవారం ఉదయం ఇంట్లోని గ్యాస్ సిలిండర్ పైపు తొలగించి నిప్పంటించాడు. దీంతో ఒక్కసారిగా సిలిండర్ పేలగా, ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఘటనా స్థలికి చేరుకుని ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పారు. అనంతరం నాగయ్యను ప్రశ్నించగా గ్రామస్తులను దుర్భాషలాడటంతో చితకబాది పోలీసులకు అప్పగించారు. ఇదేమిటని ఆరాతీయగా తననెవరూ పట్టించుకోకగా పోగా పనికి పిలవటం లేదని, కుటుంబంపై బంధువులు తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ పొంతన లేని సమాధానాలు చెప్పడం గమనార్హం.

ఉత్సవాల్లో ప్రత్యేకం.. 'కూడారై'

108 గంగాళాలతో పాయసం నివేదన



108 గంగాళాలతో స్వామివారికి నైవేద్యం సమర్పిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో ప్రత్యేకమైన కూడారై వేడుకను బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ధనుర్మాసోత్సవాల్లో 27వ రోజున ఈ వేడుక జరపడం ఆనవాయితీ. శ్రీరంగనాథుడితో తన వివాహం జరిగితే 108 గంగాళాలతో పాయసాన్ని నివేదనగా సమర్పిస్తానని గోదాదేవి అమ్మవారు మొక్కుకున్నారని, వివాహమైన తర్వాత ఆ మొక్కు చెల్లించారని ప్రతీతి. ఇందులో భాగంగా స్వామి వారితో పాటుగా గోదాదేవి అమ్మవారిని బేడా మండపంలో కొలువుదీర్చారు. ప్రత్యేక పూజలు జరిపి, ద్రవిడ ప్రబంధాలు పఠించారు. అనంతరం పాయసాన్ని నైవేద్యంగా సమర్పించారు. ఆ తర్వాత భక్తులకు ప్రసాదం అందజేశారు.

కమనీయంగా నిత్యకల్యాణం..

రామాలయ ప్రాంగణంలోని బేడా మండపంలో స్వామి వారి నిత్యకల్యాణ వేడుక కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని జరిపించారు.

చిత్రకూట మండపంలో రాపత్తు సేవ

శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ముక్కోటి అధ్యయనోత్సవాల్లో భాగంగా చిత్రకూట మండపంలో జీయర్ మఠం ఆధ్వర్యంలో రాపత్తు సేవ నిర్వహించారు. పల్లకీలో స్వామివారిని వేంచేపు చేసి.. మేళతాళాలు, భజనలు, కోలాటాల నడుమ తీసుకొచ్చి వేదికపై కొలువుదీర్చారు. కార్యక్రమంలో త్రిదండి దేవనాథ రామానుజ స్వామి సందేశం ఇచ్చారు. కాగా స్వామి వారికి జరుగుతున్న రాపత్తు సేవలు గురువారంతో ముగియనున్నాయి. శుక్రవారం నుంచి 15 వరకు విలాసోత్సవాలు, 19న విశ్వరూప సేవ జరగనున్నాయి.

రూ.4.5 కోట్లకు కుచ్చుటోపీ పెట్టిన మహిళ అరెస్ట్

ఖమ్మంక్రైం: చిట్టీల పేరుతోనే కాకుండా మాయమాటలతో పలువురి నుంచి రూ.4.5 కోట్లు వసూలు చేసి పరారీలో ఉన్న మహిళను ఖమ్మం టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బ్యాంక్ కాలనీకి చెందిన మద్దినేని రమేశ్ భార్య వనిత చాలాకాలం నుంచి చిట్టీలు నడుపుతూ అందరినీ మచ్చిక చేసుకుంది. తర్వాత అందిన చోటల్లా అప్పులు చేసి ముఖం చాటేయగా, ఆమె భర్త కూడా తనకేం సంబంధం లేదని చెప్పేవాడు. కొన్నినెలల కిందట వనిత ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోవడంతో బుర్హాన్‌పురానికి చెందిన సుజాత తదితరుల ఫిర్యాదుతో వనిత దంపతులపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ఆమెకు అప్పు ఇచ్చిన ఒకరిద్దరు మనోవేదతో మృతి చెందగా, 'సాక్షి'లో ఆమె మోసంపై 'కిలాడీ లేడీ' శీర్షికన కథనం ప్రచురితమైంది. తాజాగా వనిత ఆచూకీ తెలియడంతో పోలీసులు బుధవారం ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, ఆమె జైలుకు వెళ్లడంతో తమ డబ్బు ఎలా రాబట్టుకోవాలంటూ బాధితులు లబోదిబోమంటున్నారు.

18 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయిని పరిశీలిస్తున్న తహసీల్దార్, పోలీసులు

తల్లాడ: ఒడిశా నుంచి తరలిస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సురేశ్ కథనం ప్రకారం.. పోలీసులు బుధవారం వాహనాల తనిఖీ చేపట్టగా తల్లాడ వెంకటపద్మావతి రైస్ మిల్లు వద్ద ఏన్కూరు – తల్లాడ వెళ్తున్న ఆటోను పరిశీలించారు. అందులో ప్యాక్ చేసిన 18 కిలోల గంజాయి ఉండగా స్వాధీనం చేసుకుని, చింతూరుకు చెందిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గంజాయిని ఒడిశా సరిహద్దు నుంచి తీసుకొస్తున్నట్లు నిందితులు చెప్పారని పేర్కొన్నారు. తల్లాడ తహసీల్దార్ గంటా శ్రీలత, ఆర్ఐ రాధిక సమక్షంలో పంచనామా చేసినట్లు ఎస్ఐ వివరించారు.

బావిలోకి దూసుకెళ్లిన కారు



బావిలోకి దూసుకెళ్లిన కారు

తల్లాడ: మండలంలోని వెంగన్నపేటలో బుధవారం ఓ బావిలోకి కారు దూసుకెళ్లింది. వెంగన్నపేటకు చెందిన రిటైర్డ్ ఎఫ్‌డీఓ పగడాల కృష్ణయ్య తల్లాడ వెళ్లేందుకు కారు బయటకు తీస్తుండగా పక్క ఇంట్లోని బావిలోకి దూసుకెళ్లింది. అయితే, బావి చిన్నగా ఉండడం, కారు పెద్దది కావడంతో మధ్యలో నిలిచి పోయింది. దీంతో ఇరుగు పొరుగు వారు చేరుకుని కారును బయటకు తీయగా, పగడాల కృష్ణయ్య క్షేమంగా బయటపడ్డారు.

నా'రా'బంధువులే'!

టీడీపీ పెద్దల గుప్పిట్లో బడుగుల అసైన్డ్ భూములు



- అమరావతిలో చంద్రబాబు బృందం అక్రమాలు బట్టబయలు
- జీపీఏ, సేల్‌డీడ్లతో 'పచ్చ ముఠా' దందా
- ఇప్పటివరకు సీఐడీ గుర్తించిన అసైన్డ్ భూములు 932.72 ఎకరాలు
- వాటి మార్కెట్ విలువ రూ.3,730.88 కోట్లు
- మాజీ మంత్రి నారాయణ సమీప బంధువుల పేరిట 140 ఎకరాలు
- నారాయణ విద్యా సంస్థలు, రామకృష్ణ హౌసింగ్ ఉద్యోగుల ఖాతాలో 200 ఎకరాలు
- టీడీపీ ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీవీ వియ్యంకుడి పేరిట 40 ఎకరాలు
- చంద్రబాబు బినామీలు, సన్నిహితులు, టీడీపీ నేతల పేరిట 540 ఎకరాలు
- అన్యాక్రాంతమైన మొత్తం అసైన్డ్ భూములు 1,400 ఎకరాలు.. మార్కెట్ విలువ రూ.5,600 కోట్లు

సాక్షి, అమరావతి: అసైన్డ్ భూముల్లో వాలి పోయిన భూ రాబందుల అక్రమాలు బహిర్గతమ య్యాయి. బడుగు, బలహీన వర్గాల రైతులను బెదిరించి 932.72 ఎకరాల అసైన్డ్ భూములను పచ్చ గద్దలు కాజేసినట్లు వెల్లడైంది. గ్రామాల వారీగా ఎల్లో గ్యాంగ్ అసైన్డ్ భూముల అక్రమాల చిట్టా రట్టైంది. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2014- 18 మధ్య చోటు చేసుకున్న ఈ దారుణాలు సీఐడీ దర్యాప్తులో ఆధార సహితంగా, రియల్ ఎస్టేట్ అక్రమ సామ్రాజ్యం భౌగోళిక సరిహద్దులతో సహా వెలుగు చూశాయి. ఇప్పటివరకు బట్టబయలైన అసైన్డ్ భూములు 932.72 ఎకరాలు. చంద్రబాబు చెప్పిన ప్రకారం వాటి మార్కెట్ విలువ ఏకంగా రూ.3,730.88 కోట్లకు పైమాటే! కొనసాగుతున్న సీఐడీ దర్యాప్తులో మరిన్ని అసైన్డ్ బాగోతాలు వెలుగు చూసే అవకాశాలున్నాయి.

కార్యాలయాల వారీగా రికార్డుల పరిశీలన..

రాజధాని అమరావతి ప్రాంతంలో 2014 నాటికి ఎస్సీ, బీసీ రైతుల పేరిట ఉన్న అసైన్డ్ భూములు గత సర్కారు హయాంలో ఇతరుల పేరుతో సీఆర్‌డీఏ రికార్డుల్లో నమోదు కావడం గమనార్హం. సీఐడీ దర్యాప్తులో గుర్తించిన అసైన్డ్ భూముల రికార్డులను గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారులు ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీ చేయించారు. అమరావతి పరిధిలో 932.72 ఎకరాల అసైన్డ్ భూములను టీడీపీ పెద్దలు కొల్లగొట్టినట్టు ఇప్పటివరకు నిర్ధారించారు. భూ సమీకరణ కోసం ఏర్పాటైన సీఆర్‌డీఏ కార్యాలయాల వారీగా రికార్డులను పరిశీలించి నిజాలు నిగ్గు తేల్చారు. మొత్తం 23 సీఆర్‌డీఏ కార్యాలయాల పరిధిలో 932.72 ఎకరాల అసైన్డ్ భూములను కాజేసినట్లు ఆధారాలతో సహా నిరూపితమైంది. రాజధాని నిర్మాణం తరువాత అమరావతిలో ఎకరా మార్కెట్ విలువ కనీసం రూ.4 కోట్లకు చేరుతుందని నాడు ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబే ప్రకటించారు. ఆ ప్రకారం టీడీపీ పెద్దలు హస్తగతం చేసుకున్న 932.72 ఎకరాల అసైన్డ్ భూముల మార్కెట్ విలువ రూ.3,730.88 కోట్లకు పైమాటేనని పరిశీలకులు చెబుతున్నారు.

మొత్తం అసైన్డ్ అక్రమాలు రూ.5,600 కోట్లు!

సీఐడీ దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ మరిన్ని అసైన్డ్ భూముల అక్రమాలు వెలుగు చూసే అవకాశాలున్నాయి. అమరావతి పరిధిలో మొత్తం 1,400 ఎకరాల అసైన్డ్ భూముల రికార్డులను తారుమారు చేసినట్లు గతంలోనే సీఐడీ ప్రాథమికం గా గుర్తించింది. ఆ ప్రకారం టీడీపీ నేతలు దక్కిం చుకున్న అసైన్డ్ భూముల విలువ రూ.5,600 కోట్లని అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి.

'నారా'యణ బంధువులు, బినామీలే..

అసైన్డ్ భూముల అక్రమాల తీగ లాగితే నారా చం ద్రబాబు, పొంగూరు నారాయణ బంధువులు, బినామీల ఇళ్లల్లో డొంక కదులుతోంది. బినామీలు, బంధువుల పేరిట అసైన్డ్ భూములను జీపీఏ, సేల్ డీడ్లు ద్వారా హస్తగతం చేసుకున్నట్లు సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది. టీడీపీ ప్రభుత్వంలో కీలకం గా వ్యవహరించిన నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు సమీప బంధువు పేరిట కూడా అసైన్డ్ భూములను కొల్లగొట్టారు. నారాయణ విద్యా సంస్థలు, ఆయన సమీప బంధువుకు చెందిన రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్ చిరుద్యోగుల పేరిట అసైన్డ్ భూములను కాజేశారు. ఇప్పటివరకు గుర్తించిన 932.72 ఎకరాల అసైన్డ్ భూముల సేల్‌డీడ్లు, జీపీఏలను సీఐడీ అధికారులు విశ్లేషించగా ఈ అక్రమాలు వెలుగుచూశాయి.

'ఎన్‌స్పైర'లో కీలక ఆధారాలు స్వాధీనం

మాజీ మంత్రి పి.నారాయణ కుటుంబానికి చెందిన హైదరాబాద్‌లోని 'ఎన్ స్పైర' మేనేజ్‌మెంట్ సర్వీసెస్ కార్యాలయంలో సీఐడీ అధికారుల సోదాలు బుధవారం ముగిశాయి. కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లు, బ్యాంకు ఖాతా లావాదేవీల పత్రాలు, ఇతర కీలక రికార్డులను సీఐడీ అధికారులు స్వాధీనం చేసుకుని విశ్లేషిస్తున్నారు. మునుముందు మరిన్ని కీలక అంశాలు బహిర్గతమవుతాయని భావిస్తున్నారు.

అమరావతిలో ఎల్లో గ్యాంగ్ అసైన్డ్ దందా గ్రామాలవారీగా

గ్రామం	అసైన్డ్ భూములు ఎకరాల్లో
కృష్ణాయపాలెం	9.31
నవులూరు-1	29.30
నవులూరు-2	12.89
కురగల్లు-1	225.34
కురగల్లు-2	2.14
నిడమానూరు-1	63.43
నిడమానూరు-2	41.62
ఉండవల్లి	5.45
పెనుమాక	2.37
లింగాయపాలెం	153.90
ఉద్దండరాయునిపాలెం	20.31
బోరుపాలెం	1.25
పిచుకలపాలెం	9.99
నెక్కల్లు	17.17
నేలపాడు	17.36
తుళ్లూరు-1	43.19
తుళ్లూరు-2	12.52
అనంతవరం	6.96
రాయపూడి-1	87.26
కొండమరాజుపాలెం	6.47
వెలగపూడి	3.30
వెంకటపాలెం	27.39
మందడం-2	133.80
మొత్తం	932.72



తిరుమల ఆలయం వెలుపల తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేశ్వర రెడ్డి

ముగిసిన వైకుంఠ ద్వార దర్శనం

తిరుమల: వైకుంఠ ఏకాదశి పర్వదినాలను పురస్క రించుకుని ఏర్పాటు చేసిన తిరుమల శ్రీవారి వైకుం ఠ ద్వార దర్శనం బుధవారం అర్ధరాత్రితో ముగిసిం ది. గురువారం నుంచి యథావిధిగా శ్రీవారి కార్య క్రమాలు జరగనున్నాయి. తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. టైమ్ స్లాట్ టికెట్లు పొందిన వారికి కేటాయించిన నిర్ణీత సమయంలో త్వరితగ తిన దర్శనం లభిస్తోంది. శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేశ్వరరెడ్డి దర్శించుకున్నారు. అలాగే కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని కూడా ఆయన దర్శించుకు న్నారు. కాగా, డయల్ యువర్ టీటీడీ ఈవో కార్య క్రమం శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరుగ నుంది. ఈవో ఏవీ ధర్మారెడ్డితో మాట్లాడదలచు కున్న భక్తులు 0877-2263261 ఫోన్ నంబర్లో సం ప్రదించవచ్చు.

వాల్తేర్ వీరయ్యకు రూ.25, వీరసింహారెడ్డికి రూ.20

10 రోజులు టికెట్ల ధరలు పెంపునకు అనుమతి

సాక్షి, అమరావతి: వాల్తేర్ వీరయ్య, వీరసింహారెడ్డి సినిమాల టికెట్ల ధరలను 10 రోజులపాటు పెంచు కునేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఆ సినిమా నిర్మాతలు తమ సినిమాల బడ్జెట్ వివ రాలతో సమర్పించిన దరఖాస్తులను హోం శాఖ కమిటీ పరిశీలించి టికెట్ల ధర పెంపుపై సిఫార్సు చేసింది. దీంతో వాల్తేర్ వీరయ్య సినిమాకు టికెట్‌పై గరిష్ఠంగా రూ.25 చొప్పున, వీరసింహారెడ్డి సిని మాకు రూ.20 చొప్పున పెంపుదలకు అనుమతి నిస్తూ హోం శాఖ బుధవారం ఉత్తర్వులిచ్చింది.



జగనన్న తోడు లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

'చిరు' రుణాల్లో ఏపీ ఫస్ట్

- చిరు వ్యాపారులకు సున్నా వడ్డీ రుణాల్లో దేశ చరిత్రలోనే రాష్ట్రం రికార్డు
- దేశ వ్యాప్తంగా 24.06 లక్షల మందికి రుణాలు.. ఇందులో ఒక్క ఏపీలోనే 15.31 లక్షలు
- జగనన్న తోడు లబ్ధిదారుల ఖాతాల్లో వడ్డీ జమ చేసిన సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: చిరు వ్యాపారులకు సున్నా వడ్డీ రుణాలు ఇవ్వడంలో దేశ చరిత్రలోనే ఆంధ్ర ప్రదేశ్ రికార్డు సృష్టించిందని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. దేశంలో మొత్తం మీద చిరు వ్యాపారులకు 24.06 లక్షల మందికి రుణాలు ఇస్తే, ఇందులో ఒక్క ఆంధ్రప్ర దేశ్‌లోనే జగనన్న తోడు పథకం కింద 15.31 లక్షల మందికి రుణాలు ఇచ్చామని స్పష్టం చేశారు. రుణాల లెక్కన తీసుకుంటే దేశ వ్యాప్తం గా 39.21 లక్షల రుణాలకు గాను, ఒక్క మన రాష్ట్రంలో మాత్రమే 24.06 లక్షల మందికి రుణాలు ఇచ్చామన్నారు. జగనన్న తోడు పథకం కింద చిరు వ్యాపారులకు ఆరవ విడత రూ.10 వేల వరకు వడ్డీ లేని రుణాలను ఇచ్చే కార్యక్ర మాన్ని బుధవారం ఆయన తన క్యాంపు కార్యా లయం నుంచి ప్రారంభించారు. పూర్తి వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున 3.95 లక్షల మంది చిరు వ్యాపారులు, సంప్రదాయ చేతివృత్తుల వారికి బ్యాంకుల ద్వారా కొత్తగా రూ.395 కోట్ల రుణాలు అందించడంతో పాటు, గత 6 నెలలకు సంబంధించిన రూ.15.17 కోట్ల వడ్డీ రీయింబ ర్స్‌మెంట్‌ను కంప్యూటర్‌లో బటన్ నొక్కి లబ్ధిదా రుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. చిరు వ్యాపారుల్లో 80 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అక్కచెల్ల మ్మలు, అన్నదమ్ములకు 'జగనన్న తోడు'అందు తోందని తెలిపారు. 3.95 లక్షల మందిలో 3.67 లక్షల మంది సకాలంలో రుణాలు చెల్లించి, మళ్లీ రెండోసారి రుణాలు తీసుకుంటున్నారని చెప్పారు. వీరు కాక మరో 28 వేల మందికి ఇవాళ రుణాలు ఇస్తూ కొత్తగా ఈ పథకంలో తీసుకొచ్చామన్నారు. మొత్తంమ్మీద జగనన్న తోడు ద్వారా దాదాపు 15.31 లక్షల చిరు వ్యాపా రుల కుటుంబాలకు మంచి జరుగుతోందని స్పష్టం చేశారు.

47 హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: ఏపీ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో 47 హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ పోస్టుల భర్తీకి వైద్య శాఖ నోటిఫికేషన్ ఇచ్చింది. https://dmeaponline.com వెబ్‌సైట్ లో ఆన్‌లైన్ అప్లి కేషన్‌ను అందుబాటులో ఉంచారు. బుధవారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ మొదలు పెట్టారు. అర్హులైన వైద్యులు ఈ నెల 17వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఓసీ, బీసీ అభ్యర్థులకు రూ.వెయ్యి, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.750 చొప్పున దరఖాస్తు రుసుం ఉంటుంది. రెండేళ్ల కాలపరిమితితో కాం ట్రాక్ట్ ప్రాతిపదిక పోస్టుల భర్తీ చేపడతారు. ఎం బీబీఎస్/బీడీఎస్ పూర్తి చేసి హాస్పిటల్ అడ్మిని స్ట్రేషన్‌లో మాస్టర్ డిగ్రీ/హాస్పిటల్ మేనేజ్‌మెం ట్/ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్/ఎంబీఏ హ్యూమన్ రీసోర్స్ కోర్సులు చేసి, ఇతర అర్హత లున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఏడాది జూలై ఒకటో తేదీ నాటికి గరిష్ఠ వయోపరిమితి 42 ఏళ్లు మించకుండా ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు మూడేళ్లు, దివ్యాంగులకు 10 ఏళ్లు వయోపరిమితి నుంచి మినహాయింపు ఉంటుం ది. http://hmfw.ap.gov.in వెబ్‌సైట్‌లో నోటిఫికేష న్‌ను అందుబాటులో ఉంచారు.

జిల్లా వార్తలు

తుదిపోరుకు పంజాబ్



క్రికెటర్లతో పోటీల నిర్వాహకులు

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం లో జరుగుతున్న ఆల్ ఇండియా క్రికెట్ పోటీల్లో బుధవారం జరిగిన తొలి సెమీస్‌లో విజయం సాధించిన పంజాబ్ జట్టు తుదిపోరుకు అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో పంజాబ్-నేపాల్ జట్లు తలపడగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచు కున్న పంజాబ్ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టా నికి 120 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ ఆరంభించిన నేపాల్ జట్టు నిర్ణీత ఓవర్లలో 96 పరుగులే ఆలౌట్ కావడంతో పం జాబ్‌ను విజయం వరించింది. అంతకుముం దు జరిగిన చివరి లీగ్‌లో ఖమ్మం ప్రీమియర్ లీగ్ (కేపీఎల్)-హిమాచల్‌ప్రదేశ్ జట్లు తలపడ గా తొలుత బ్యాటింగ్ చేసిన కేపీఎల్ జట్టు నిర్ణీత ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 175 పరు గులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన హిమాచల్‌ప్రదేశ్ 14.2 ఓవర్లు ఆడి 103 పరుగు లకే కుప్పకూలింది. దీంతో కేపీఎల్ సెమీస్‌కు చేరింది. మ్యాచ్‌లను టోర్నీ ఆర్గనైజింగ్ కార్యద ర్శి ఎండీ మతిన్‌తో పాటు బావారి గుర్జర్, డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, ఓలేటి సాం బమూర్తి, సందీప్ ఆర్యన్ ప్రారంభించారు.

ఫిబ్రవరి 15నుండి వారబందీ

వైరా: వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో యాసంగి సాగు అవసరాలకు నీరు విడుదల చేసే తేదీలను నీటి పారుదల శాఖ అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 15 అడుగుల మేర నీరు నిల్వ ఉన్న నేపథ్యాన ఫిబ్రవరి 15వ తేదీ నుండి వారబందీ నిర్వహి స్తున్నట్లు ఐబీ డీఈ శ్రీనివాస్ వెల్లడించారు. అప్పటి వరకు పూర్తిస్థాయిలో నీరు విడుదల చేస్తామని తెలిపారు. ఇక ఏప్రిల్ 30 వరకు సాగునీటి విడుదల ఉంటుందని, ఆ తర్వాత కుడి, ఎడమ కాల్వల హెడ్ స్లూయీజ్‌లు మర మ్మతు చేయించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే నార్లు పోసుకున్న రైతులు వారబందీ ప్రకారం నీటి తడులు పెట్టుకోవాలని సూచించారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా కందాల ప్రీమియర్ లీగ్ సీజన్-1 పేరిట రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ విష యాన్ని కందాల యూత్ సభ్యులు బుధవారం వెల్లడించారు. పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేం దర్‌రెడ్డి పోటీలను గురువారం ప్రారంభిస్తారని తెలిపారు. ఇక ఇదే గ్రామంలో సంక్రాంతి సంద ర్భంగా రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ పోటీ లు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు బుధ వారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

ముహూర్తం నేడే..



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కలెక్టరేట్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్త గూడెం సమీకృత జిల్లా కార్యాలయాల సము దాయాన్ని(ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ ఆఫీస్) ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు గురు వారం ప్రారంభించనున్నారు. ఆ తర్వాత జిల్లా కేం ద్రమైన కొత్తగూడెంలో నిర్మించిన బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. అంతకంటే ముం దు కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహిరం గ సభలో ఆయన ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 1:55 గంటలకు జిల్లాకు చేరుకుని, సాయంత్రం 4:30 గం టలకు హైదరాబాద్‌కు తిరిగి బయలుదేరి వెళ్తారు.

మహబూబాబాద్ నుంచి..

ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ నుంచి సీఎం కేసీఆర్ బయలుదేరుతారు. ముందుగా మహబూబాబాద్ చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం 1:30 గంటలకు మహ బూబాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 1:55 గంటలకు జిల్లా నూతన కలెక్టరేట్ ప్రాంగణం లో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. రెండు గంటలకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాన్ని ప్రారంభిస్తారు. అనంతరం కలెక్ట రేట్ ప్రాంగణంలో వెనుక వైపు ఏర్పాటు చేసిన వేదిక పైనుంచి జిల్లా అధికారులు, పార్టీ ముఖ్య నేతలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

రోడ్డు మార్గంలో..

మధ్యాహ్నం 3:20 గంటలకు బహిరంగ సభ ముగించుకుని రోడ్డు మార్గంలో కొత్తగూడెం వెళ్తారు. ఈక్రమంలో 3:35 గంటలకు భారత రాష్ట్ర సమితి జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించి తెలం గాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి పూల దండలు వేస్తారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో కొద్దిసేపు ముచ్చటిస్తారు. అనం తరం ప్రకాశం స్టేడియంలోని హెలిప్యాడ్ నుంచి 4:30గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరుతారు.

గులాబీమయం

సీఎం రాక సందర్భంగా కలెక్టరేట్ ప్రాంగణం, ప్రకాశం స్టేడియం.. రెండు చోట్ల ప్రత్యేకంగా హెలిప్యాడ్లు సిద్ధం చేశారు. కలెక్టరేట్ నుంచి బీఆర్ ఎస్ కార్యాలయం వరకు సుమారు ఆరు కిలోమీట ర్ల మేర కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పార్టీ అధినేత రాకను పురస్కరించుకుని రోడ్డుకు ఇరువైపులా గులాబీ జెండాలు, ఫ్లెక్సీలు, భారీ కటౌ ట్‌లు వెలిశాయి. 'మీ వనమా' పేరుతో స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు భారీ ఎత్తున స్వాగత కార్యక్రమాలు చేపట్టారు. సీఎం కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికేందుకు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు సిద్ధమయ్యారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు పరిమిత సంఖ్యలో ఆహ్వానాలు ఉన్నందున ముఖ్య నాయకులే రావాలని ఆ పార్టీ నేతలు విజ్ఞప్తి చేశారు.

జిల్లా విద్యార్థులకు గవర్నర్ అభినందన

ఖమ్మం సహకారనగర్/ఎర్రుపాలెం: ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థు లను గవర్నర్ తమిళిసై అభినందించారు. హైద రాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి జీ-20 సమ్మిట్‌లో కళాశాల విద్యార్థులు ఎస్.డీ.ఫర్హీన్ సుల్తానా, షేక్ అస్మా సుల్తానా ఉర్దూ విభాగం బహుమతులు సాధించగా గవర్నర్ అభినందించగా, ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా, ఎన్ఎస్ఎస్ డీపీఓ శ్రీనివాస రావు పాల్గొన్నారు. అలాగే, ఎర్రుపాలెంలోని సర స్వతి డిగ్రీ కళాశాల విద్యార్థిని బట్టా చాముండేశ్వరి ఉపన్యాస పోటీల్లో ఆమె ప్రతిభ కనబర్చగా గవ ర్నర్ ప్రశంసాపత్రం అందజేశారు. ఆమెను ప్రిన్సిపాళ్లు జమలాపురపు గోపాలకిషన్‌రావు, మిర్యాల శ్యాంప్రసాద్, పాఠశాల హెచ్ఎం దండెం సత్యనారాయణరెడ్డితో పాటు బి.మురళీమోహన్ రావు, సామినేని గిరిధర్, రమేశ్ సన్మానించారు.



ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ విద్యా ర్థులను అభినందిస్తున్న గవర్నర్



చాముండేశ్వరిని అభినందిస్తూ..

సహాయనిధికి విరాళం

జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్ సహాయనిధికి త్రివేణి విద్యాసంస్థల తరపున విరాళం అందజేసి నట్లు డైరెక్టర్ డాక్టర్ వీరేంద్ర చౌదరి తెలిపారు. ఈమేరకు సేకరించిన రూ.1,01,116ను హైద రాబాద్‌లో గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా సహాయనిధికి అందజేశామని డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. కృష్ణవేణి -త్రివేణి పాఠశాలల అధిపతి వై వెంకటేశ్వరరావు తోపాటు మురళీకృష్ణ, శ్రీదేవి, ముస్తఫా, అశోక్, చార్లెస్, సందీప్ పాల్గొన్నారు.



గవర్నర్‌కు ఆర్థిక సహాయం అందచేస్తున్న త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ వీరేంద్రచౌదరి

ఈవీఎం గోదాం తనిఖీ

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాంను బుధవారం కలెక్టర్ వీ.పీ.గౌతమ్ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా పోలీసుల విధులు, సమయపాలన రిజిస్టర్లను తనిఖీ చేసి పలు సూచన లు చేశారు. అదనపు కలెక్టర్ మధుసూదన్, అసిస్టెం ట్ కలెక్టర్ రాధిక గుప్తా, కలెక్టరేట్ సూపరింటెండెం ట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సెలవులు రద్దు

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఈనెల 18వ తేదీన జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యాన జిల్లా స్థాయి అధికారులందరి సెలవులు రద్దు చేస్తూ కలెక్టర్ గౌతమ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఎం పర్యటన వరకు అధికారులంతా విధుల్లోనే ఉండా లని సూచించారు. ఆయా శాఖల్లోని సిబ్బంది ఎవ రికైనా సెలవులు ఇచ్చి ఉంటే రద్దు చేసి తిరిగి విధు లకు హాజరయ్యేలా చూడాలని తెలిపారు.

'సదరం' స్లాట్ బుకింగ్ నిలిపివేత

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ నెల 18వ తేదీ నుండి మార్చి 28వ తేదీ వరకు జరగాల్సిన సదరమ్ శిబిరాల స్లాట్ బుకింగ్ నిలిపి వేశారు. తదుపరి క్యాంపుల తేదీలు త్వరలో ప్రకటి స్తామని ఆస్పత్రి సూపరింటెండెంట్ తెలిపారు.

'కంటి వెలుగు'ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ముర్తుజా రిజ్వీ, పక్కన కలెక్టర్ గౌతమ్, ఇతర అధికారులు

వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి ముర్తుజా

ఖమ్మం సహకారనగర్: కంటి వెలుగు రెండో దశ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ సూచించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేతా మహంతి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, డీహెచ్ డాక్టర్ జి.శ్రీనివాసరావుతో కలిసి బుధ వారం ఆయన వైద్యాధికారులతో కంటి వెలుగు అమలుపై సమీక్షించారు. ఈసందర్భంగా రిజ్వీ మాట్లాడుతూ రెండోవిడత కంటి వెలుగు వంద రోజులు కొనసాగనుండగా, జిల్లా సీనియర్ వైద్య శాఖ అధికారి నిర్వహణ బాధ్యతలు చూడాలని సూచించారు. వారంలో శని, ఆదివారాలు మినహా ఉదయం 9నుండి సాయంత్రం 4 గంటల వరకు శిబిరాలు నిర్వహించాలని, బృందాలకు రోజువారీ భోజన ఖర్చులుగా రూ.1,500 అందుతాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ సమయాన ఓసారి, కంటి స్క్రీనింగ్ తర్వాత ఇంకోసారి వివరాలు నమోదు చేయాలని చెప్పారు. శిబిరాల వద్ద అన్ని వసతులు కల్పించాలని సూచించారు. అనంతరం కమిషనర్ శ్వేతా మహంతి, డీహెచ్ శ్రీనివాసరావు మాట్లా డుతూ పలు సూచనలు చేయగా, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలో కంటి వెలుగు అమలుకు చేస్తున్న ఏర్పాట్లను వివరించారు. ఈస మావేశంలో టీఎస్ఎంఐడీసీ ఎండీ చంద్రశేఖర్, అదనపు కలెక్టర్ స్నేహలత, కేఎంసీ కమిషనర్ ఆద ర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ రాధిక గుప్తా, డీఎం హెచ్ఓ బి.మాలతి, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, డీఎల్పీఓ పుల్లారావు, కంటివెలుగు ప్రత్యేకాధికారి డాక్టర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభం ఏర్పాట్లు ఘనంగా ఉండాలి

రఘునాథపాలెం: కంటి వెలుగు రెండో దశ కార్యక్రమాన్ని ఖమ్మంలో ప్రారంభించనుండ గా, ఏర్పాట్లు ఘనంగా చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆదే శించారు. ఖమ్మం నూతన కలెక్టరేట్‌ను పరిశీలించాక ఆయన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి కంటి వెలుగు ప్రారం భోత్సవంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నూతన కలెక్టరేట్‌లో కంటి వెలుగు ప్రారంభోత్సవానికి అనువైన గదుల ఎంపిక, సామగ్రి ఏర్పాట్లపై సూచనలు చేసిన ఆయన ఏర్పాట్లు పక్కాగా చేయాలని తెలిపారు. వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ, కమిషనర్ శ్వేతా మహంతి, డీహెచ్ఓ జి.శ్రీని వాసరావు తదితరులు ఉన్నారు.

ఆరోగ్యశ్రీ ద్వారా నాణ్యమైన సేవలు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రితో పాటు వివిధ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా నాణ్యమైన సేవలందుతున్నాయని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. పెద్దాస్పత్రిలో బుధవారం ప్రభుత్వ, నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలతో ఆయన సమావేశమ య్యారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా పైసా ఖర్చు లేకుం డా ఉచితంగా సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ గోపి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా నిరుపేదలకు ఎం తో మేలు జరుగుతోందని, రోగుల వద్ద నుండి ఎవ రైనా డబ్బు వసూలు చేసినట్లు తెలిస్తే యజమాన్యా లపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఏడాది కాలంగా ఆరోగ్యశ్రీ ద్వారా నగదు అందడం లేదని, ప్రస్తుతం ఇచ్చే ప్యాకేజీ పెంచాలని నెట్‌వర్క్ ఆస్ప త్రుల యాజమన్యాలు విన్నవించగా ఉన్నతాధి కారులకు నివేదిస్తామని హామీ ఇచ్చారు. ఆరోగ్యశ్రీ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు